క్లుప్తంగా

నేడు గంగమ్మ జాతర

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం మొదటి ఆదివారం జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.సురేష్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల గంగమ్మ జాతర ముగిసిన తర్వాత నిర్వహించే వారాల్లో భాగంగా ఆదివారం మొదటి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయం 30వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు గంగమ్మ తల్లికి బోనాల ఉత్సవంతో ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు భక్తులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలకు వేలం పాట ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ఆరుపళ్ల దూడల విభాగానికి చెందిన వృషభరాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన యజమానులకు రూ.30, రూ.15, రూ.10 నగదు బహుమతులు ఉంటాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



భోజనం తనిఖీ చేస్తున్న జడ్జి

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలోని కస్తూర్బా గాంధీ, గుల్లకుంట గ్రామంలోని వెలుగు పాఠశాలలను శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫక్రుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో పిల్లలకు ఉన్న సదుపాయాల తోపాటు వారికి ఎటువంటి ఆహారాలను అందిస్తున్నారు.. పరిసరాలు ఎలా ఉన్నాయి అన్న దానిపై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలకు భద్రతతోపాటు వారి హక్కుల గురించి వివరించారు. రాబోయే రోజుల్లో పరీక్షల సమయం కాబట్టి ప్రతి బాలిక పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించటానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళీధర్‌రెడ్డి, సూర్యపెద్దిరాజు, భాస్కర్‌రెడ్డి, సీవి కొండారెడ్డి, ఎస్‌వి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, హౌసింగ్ డీఈ విజయబాబులు పరిశీలించి వివరాలను సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగంగా జరిపించాలని సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో కడ్డీలు, సిమెంట్, ఇసుకను అందించాలని అప్పుడే పనులు త్వరగా జరుగుతాయని ఆయన తెలిపారు. లబ్ధిదారులకు పీబీఎల్ దశకు వచ్చిన తర్వాతే సిమెంట్ ఇస్తామని ముందుగా ఇవ్వలేమని హౌసింగ్ ఏఈ రవికుమార్ తెలిపారు. సిమెంట్ ఇవ్వకపోతే పనులు పీబీఎల్ దశకు ఏవిధంగా వేయాలని కాంట్రాక్టర్లు అంటూ.. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా త్వరగా ఇవ్వాలని కాంట్రాక్టర్లు వాపోయ్యారు.

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ శేషారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట

చెన్నూరు : బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని నిరూపించాడన్నారు. ఇందుకు సాక్ష్యమే నేడు ఎమ్మెల్సీలకు ఇచ్చిన ప్రాధాన్యత అని ఆయన తెలియజేశారు. ఇది బడుగు, బలహీన వర్గాలకు పండుగ రోజని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మడక విజయలక్ష్మి, సర్పంచ్ చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథం, మడక వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ శేఖర్, మాజీ ఎంపీటీసీ నరసయ్యయాదవ్, డాక్టర్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి విస్తరణ పనులు

- వేంపల్లెలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు
- డిసెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు
- వేంపల్లె గ్రామస్తుల హర్షం



రోడ్డుపనుల్లో భాగంగా ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్న జెడ్పీ కాంప్లెక్స్ గదులు

వేంపల్లె : మండల కేంద్రమైన వేంపల్లెలో మెయిన్ రోడ్డు (డబుల్ రోడ్డు) విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణ ప్రజల కోరిక మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, స్థానిక జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డిలు మెయిన్ రోడ్డు 72 అడుగుల మేర విస్తరణ చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. అందుకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీనికి అనుగుణంగా రోడ్డుకు ఆనుకుని ఉన్న షాపుల యజమానులు, వాణిజ్య సముదాయాలు, ఇళ్లు, స్థలాలు, రోడ్డు సెంటర్ నుంచి చెరో వైపు 36 అడుగుల స్థలాన్ని ఇచ్చి భవనాలను స్వయంగా తొలగించారు. దీంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి పైపుల నిర్మాణాలు ప్రస్తుతం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి, అక్కడ నుంచి బై పాస్‌లోని ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు దాదాపు భవన నిర్మాణాలు తొలగించారు. అయితే మొన్నటి వరకు నష్టపరిహారం డబ్బులు రాకపోవడంతో కొంత మేర ఆలస్యం జరిగింది. యజమానులకు నష్టపరిహారం డబ్బులు పూర్తి చెల్లించడంతో విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి.

రూ.200కోట్లతో అభివృద్ధి పనులు :
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేంపల్లెలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.15 కోట్లతో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల రూ.1.2 కోట్లతో ఫైర్‌స్టేషన్, రూ.2 కోట్లతో వైఎస్సార్ మెమోరియల్ పార్కులు పూర్తయ్యాయి. రూ.5 కోట్లతో ఉర్దూ జూనియర్ కళాశాల, రూ.20 కోట్లతో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రూ.92 కట్లతో యూజీడీ, రూ.50 కోట్లతో సిమెంటు రోడ్డు, విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ట్రాఫిక్ సమస్య తీరనుంది.. :
ఎన్నో ఏళ్లుగా ఉన్న ట్రాఫిక్ సమస్య ఇప్పటికి తీరనుంది. 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయడంతో ఈ సమస్య తొలగిపోనుంది. పండుగలు, ఊరేగింపులు జరిగినప్పుడు ట్రాఫిక్‌తో చాలా ఇబ్బంది పడేవారం. వాహనదారులు, పాదాచారులు, రోడ్డుపైకి వెళ్లాలంటే భయమేసేది.
– డి.కొండయ్య(స్థానికుడు), వేంపల్లె



వైఎస్సార్‌సీపీతోనే వేంపల్లె అభివృద్ధి :
వేంపల్లె మండలం వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధించింది. టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కొంత మేర అభివృద్ధి చేయగా.. ఆయన తనయుడు ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అభివృద్ధి చేశారు. వేంపల్లె మండల ప్రజలు వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉంటారు. నియోజకవర్గంలో పులివెందుల తర్వాత వేంపల్లె అభివృద్ధి చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం.
– ఎం.రవికుమార్‌రెడ్డి(జెడ్పీటీసీ), వేంపల్లె

నేడు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునేవారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంబకపల్లె రోడ్డు సమీపంలోని నగర వనం పనులు ఎంతవరకు వచ్చాయని.. ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఏపీజీడీసీ అధికారులు, అటవీ శాఖ అధికారులతో నగర వనం అభివృద్ధిపై చర్చించారు. నగర వనంలో ఎంట్రీ బ్లాక్, మార్కెట్ బ్లాక్, గజీబ్ డూమ్, పాత్ వే పనుల పురోగతిపై చర్చించారు. అలాగే నియోజకవర్గంలోని రోడ్లు, ఆలయాల నిర్మాణ పురోగతి పనులపై ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. తొండూరు, వేంపల్లె కొత్త తహసీల్దార్ కార్యాలయాల పనులపై చర్చించారు.కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఓబుళరెడ్డి, డీఈ రవిచంద్రారెడ్డి, ఏఈలు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



గోదామును తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఏఓ

వేముల : రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా శనగల కొనుగోలు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ నిర్వాహకులకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏఓ చెన్నారెడ్డితో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. తుకాల విషయంలో కానీ, నాణ్యతలో కానీ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతు శనగలను కొనుగోలు చేయాలన్నారు. అనంతరం ఆయన స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల శనగలను కొనుగోలు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల కొనుగోలు చేశారన్న వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ రేఖ, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని ఆదరించండి



ఓటు అభ్యర్థిస్తున్న మండల ఇన్‌చార్జి, తదితరులు

వేముల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని ఆదరించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండలంలోని వి.కొత్తపల్లె, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డితో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన రవీంద్రారెడ్డి యువతకు అండగా ఉండి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తారని.. ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగరాజు, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం విజయవిహారి

పులివెందుల టౌన్ : గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో ఒకే పంటను పండించడం ద్వారా భూమి సారవంతం తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతారని.. కావున రైతులు పంట మార్పిడి చేయడంవల్ల అధిక లాభాలు సాధించవచ్చునని నాబార్డు డీడీఎం విజయవిహారి తెలిపారు. శనివారం పట్టణంలోని రైట్స్ శిక్షణ కార్యాలయంలో వేరుశనగ కాయల, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు ఆయన రైతు సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఎఫ్‌పీఓలను బలోపేతం చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని, పీఎంఈజీపీ, క్రెడిట్ సబ్సిడీ లింక్ పథకాల ద్వారా రైతులకు మరింత ఆదాయం చేకూరుతుందన్నారు. అలాగే రైట్స్ డైరెక్టర్ త్యాగరాజు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడటం ద్వారా రైతులకు కావాల్సిన వివిధ రకాల ఉత్పాదకాలను సముచిత ధరలకు అందించడం జరుగుతుందన్నారు. అలాగే రైతులకు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీఈఓ పుష్పరాజు, రైట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం



గ్రామంలో ఇళ్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మగూడూరు గ్రామంలో శనివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి గ్రామంలో ఇళ్లు, కలాలు తదితర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏవైనా సమస్యలుంటే మహిళా పోలీసులకు తెలిపితే తక్షణమే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీకేదిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని కృష్ణాపురంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన రికార్డులులేని 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో శనివారం నాకాబంది నిర్వహించి పలు ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటకృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక బహిరంగ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : జమా అతె ఇస్లామి హింద్ ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పట్టణాధ్యక్షుడు డీఎం షరీఫ్ పేర్కొన్నారు. శనివారం జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆధ్యాత్మిక సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో జమా అతె ఇస్లామి హింద్ జాతీయ, రాష్ట్ర నాయకులు, ఇస్లాం ధార్మిక పండితులు పాల్గొంటారని వివరించారు. ఈ సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొండాపురం : బుడ్డ శనగల కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ శోభన్‌బాబు, వ్యవసాయ అధికారిణి అరుణలు శనివారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో క్వింటాలుకు రూ.5,335తో కొనుగోలు చేస్తామన్నారు. మండల రైతులు సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో ఈ క్రాఫ్ నమోదు చేయించుకుని సోమవారం నుంచి వెంకటేశ్వర గొడౌన్ వద్దకు వెళ్లాలని వారు సూచించారు. ఏమైన సందేహాలు ఉంటే 9492624613 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బాలాజీ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హైకోర్ట్ న్యాయవాది జైరెడ్డి లక్ష్మీరెడ్డి తెలిపారు. కిమ్స్ ఆసుపత్రి (కర్నూల్, హైదరబాద్) వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పంట నమోదు, ఈకేవైసీ చేసుకోండి

చెన్నూరు : రైతులు పంటనమోదు, ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంట నమోదు, ఈకేవైసీ చేసుకునేందుకు ఈనెల 28వ తేదీవరకు టైం వుందన్నారు. ఇప్పటివరకు 3436 ఎకరాలలో వివిధ పంటలకు సంబంధించి 1959 మంది రైతులకు సంబంధించి పంట నమోదు చేశామన్నారు. 1959 మంది రైతులకుగాను మండలంలో 166 మంది రైతులు ఇంకా ఈకేవైసీ నమోదు చేసుకోలేదని ఆమె తెలిపారు. ఈకేవైసీ చేసుకోని రైతులకు సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు సౌకర్యం లభించదని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన అంకాలమ్మ తిరునాల

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల ఘనంగా ప్రారంభమైందని ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ, సభ్యులు గంగిశెట్టి, వెంకటసుబ్బయ్యలు తెలిపారు. ఈనెల 25, 26వ తేదీలలో అంకాలమ్మ తల్లి తిరునాల వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేడు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రతి విద్యార్థి మంచి గుర్తింపు తెచ్చుకోవాలి

వేంపల్లె : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మహాత్మ జ్యోతిభా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ హరిత ఆధ్వర్యంలో నాల్గవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వీరారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణయ్య, ఏపీ రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అరటి పంట దగ్ధం

లింగాల : ఎగువపల్లెలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో అరటి పంట దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో అది సమీపంలోని అరటి పంటకు చేరి పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన దిబ్బల శాంతమోహన్ రెడ్డికి చెందిన 2 ఎకరాల అరటి, లింగాల లింగారెడ్డికి చెందిన ఎకరా అరటి పంట పూర్తిగా కాలిపోయింది పంటతోపాటు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, పోటు కర్రలు పూర్తిగా కాలిపోయి సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క తోటలకు ప్రవేశించకుండా అదుపు చేశారు.



పూర్తిగా కాలిపోయిన అరటి పంట

అంధులు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం



వేంపల్లెలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవీరనారాయణమ్మ అంధుల ఆశ్రమంలో శనివారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి దుద్దేకుంట రవిశేఖర్ తండ్రి దుద్దేకుంట సూర్యుడు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని అంధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింహాద్రిపురం మండలంలోని దుద్దేకుంట గ్రామంలోని దివంగత సూర్యుడు సమాధి వద్ద కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమారుడు డి.రవిశేఖర్, కుమార్తె డి.రుక్మిణీదేవి, అల్లుడు హరిప్రసాద్, మనుమడు రామలింగేశ్వర, మనుమరాలు హేమలత, మనుమడు గంగాధర్‌లు పాల్గొన్నారు.

వేంపల్లె : వేంపల్లె పాత గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో దివంగత సూర్యుడు వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగాల : మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

జగనన్న మార్ట్‌ను విస్తృతం చేయాలి

– మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందులలోని జగనన్న మార్ట్‌ను విస్తృతం చేయాలని మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పాత మీసేవ భవనంలో పట్టణ సమాఖ్య ఈసీ, ఓబీ సభ్యులకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న మార్ట్‌ను బాధ్యతగా తీసుకుని మరింతగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం జగనన్న మహిళా మార్ట్ కొనుగోళ్ల గురించి, జగనన్న హౌసింగ్ లబ్ధిదారుల వాటా కింద రూ.30 వేలు కట్టించే విధానంపై అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లేఔట్‌లో అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్దుతామని.. అందులో లబ్ధిదారుల వాటాగా కట్టాల్సిన రూ.35 వేలను త్వరగా కట్టించేలా చూడాలన్నారు. ఆ డబ్బులకు పూర్తి బాధ్యత మేం వహిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏఓ సురేష్‌రెడ్డి, డీసీఓ నారాయణరెడ్డి, మెప్మా అధికారి గంగులయ్య, సీసీలు, ఆర్పీలు, పట్టణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు



ఎరువుల దుకాణంలో పురుగు మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

లింగాల : వెలిదండ్ల గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం విజిలెన్స్ అధికారులు బాలగంగాధరరెడ్డి, లోకేశ్వరరెడ్డిలు ఏఓ రమేష్‌తో కలసి దాడులు నిర్వహించారు. దుకాణాలలో ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులలో స్వల్ప వ్యత్యాసం ఉన్నందున ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువుల డీలర్లను రికార్డులు సక్రమంగా నిర్వహించి ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సింహాద్రిపురంలో ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు ఏఓ శివమోహన్‌రెడ్డితో కలసి ఎరువుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి రికార్డులలో ఉన్నటువంటి స్టాకు వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల స్టాకు వివరాలలో వ్యత్యాసం ఉండటంతో ఎరువుల దుకాణాలలో ఎటువంటి అమ్మకాలు జరపరాదని ఆదేశాలు జారీ చేశారు.

చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి



వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యులు శాంతికళ

ఎర్రగుంట్ల : చిన్న పిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ శాంతికళ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పోట్లదుర్తి, పట్టణంలోని శాంతినగర్ కాలనీలో జరుగుతున్న వ్యాధి నిరోధక ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా టీకాలు వేయిస్తే వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జ్యోత్స్న, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు ఓబులేసు, లక్ష్మీదేవి, సీ హెచ్ఓ ప్రశాంత్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ముద్దనూరు : వ్యాధినిరోధక టీకాలు పిల్లలందరికీ వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శాంతికళ సిబ్బందిని ఆదేశించారు. శనివా రం మండలంలోని కొత్తపల్లె, యామవరం, ముద్దనూరులలో వ్యాధి నిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. తల్లితండ్రులు తమ పిల్లలందరికీ టీకాలు వేయించాలని, టీకాలు వేయించడంవల్ల పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వైద్యాధికారి కరిష్మా, సీహెచ్‌ఓ మహదేవయ్య, సూపర్‌వైజర్ శోభారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమాజసేవకు పాటుపడాలి



మాట్లాడుతున్న స్థైర్యానంద సరస్వతి స్వామీజీ

కమలాపురం : ఏయిమ్ ఫర్ సేవ విద్యార్థులంతా అనాథలు కారని, మీకందరికీ మేమంతా అండగా ఉన్నామని, మీరు మంచి చదువులు అభ్యసించి సమాజసేవకు పాటు పడాలని శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక ఏయిమ్ ఫర్ సేవా (ఛాత్రాలయం) 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయిమ్ ఫర్ సేవ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథ విద్యార్థులను అక్కున చేర్చుకుని వారికి మంచి భవిష్యత్తు ఇద్దామని స్వామి దయానంద సరస్వతి పలు దేశాల్లో ఇలాంటి సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అడ్మినిస్ట్రేటర్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఛాత్రాలయంలో ఇప్పటి వరకు టెన్త్ క్లాస్ వరకు మాత్రమే విద్య నందించేవారన్నారు. ఇకపై ఇంటర్, డిగ్రీలో సైతం తమ కళాశాలలో చదివిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టెన్త్ పాస్ అయిన విద్యార్థులంతా పాలిటెక్నిక్ కళాశాలలో చేరితే మంచి విద్యనందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయులు రాఘవ చంద్రశేఖర్, సెక్రటరీ అల్లె రాజారెడ్డి, కమిటీ మెంబర్లు ఎస్‌సీ పుల్లారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, రెడ్డి సురేష్, సీవీ సుబ్బరాజు, నిఖిల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.